సాక్షి కర్నూలు
శుక్రవారం । 13 । జనవరి । 2023
I


చండీశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు


విద్యుత్ దీపాలంకరణలో ఆదిదంపతులు


పుష్పాలంకరణలో ఆలయ ధ్వజస్తంభం

న్యూస్‌రీల్

మహిళల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించిన సీఎస్ జవహర్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ రామసుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): బాలలు, మహిళల్లో రక్తహీనత నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన అంశాలపై సమీక్ష నిర్వహించారు. హైరిస్కు గర్భిణులను ముందుగానే గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించాలన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. బడిమానేసిన విద్యార్థులను వలంటీర్ల ద్వారా సర్వే చేయించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన సీసీఎల్‌ఏ కమిషనర్ జి.సాయిప్రసాద్

కర్నూలు(సెంట్రల్): రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సీసీఎల్‌ఏ కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, ఇంటి పట్టాలు, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 15వ తేదీలోపు రీసర్వేలో భాగంగా చేపట్టిన గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఇంటి స్థలం కోసం ఇచ్చిన దరఖాస్తులకు 90 రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటికే 68 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా, మరో 404 గ్రామాల్లో క్షేత్రస్థాయి పీఓఎల్‌ఆర్ ప్రక్రియను మొదలు పెట్టామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సీసీఎల్‌ఏ కమిషనర్ జి.సాయిప్రసాద్‌కుకు వివరించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా నాగమల్లేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖకు సంబంధించి జిల్లా రిజిస్ట్రార్‌గా నాగమల్లేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన ఒంగోలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరిని కర్నూలు ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నంబర్ 49ని విడుదల చేసింది.

ప్రతి రోజూ లక్ష పనిదినాలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి రోజూ లక్ష పనిదినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందికి జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సూచించారు. ఉపాధి పనులకు లేబర్ రిపోర్టింగ్ పెంచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం ఆయన తన చాంబరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఏపీడీలు, ఏపీఓలతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఉపాధి పనులకు డిమాండ్ ఎక్కువగా ఉంటోందని, అయితే కూలీల సంఖ్య తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. బుధవారం ఉపాధి పనులకు 39,873 మంది, గురువారం 37,967 మంది హాజరయ్యారన్నారు. ఏపీడీ, ఏపీఓలు క్షేత్రస్థాయికి వెళ్లి కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి పనులకు హాజరయ్యే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఅండ్‌ఈ భాస్కర్‌నాయుడు, విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీల సర్దుబాటుకు కసరత్తు

కర్నూలు(సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో 2,127 ఉపాధ్యాయ ఖాళీల సర్దుబాటుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఎంఈఓల ద్వారా వివరాలను సేకరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 2,127 టీచర్ పోస్టులు అవసరం ఉండగా, గత ఏడాది సెకండరీ గ్రేడ్ టీచర్లు 1,300 మందికి పదోన్నతులు ఇచ్చారు. వీరితో తాత్కాలికంగా సర్దుబాటు చేసి ఇంకా మిగిలిన 827 పోస్టులను ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాలో జూనియర్ల చేత తాత్కాలిక సర్దుబాటు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈఓ వి.రంగారెడ్డితో సమావేశమయ్యారు. సర్దుబాటుతో సీనియర్ టీచర్లు నష్టపోతారని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని డీఈఓను కోరారు.

మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- ముస్తాబైన శ్రీశైల మల్లన్న, భ్రమరాంబిక స్వామివార్లు
- పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు ఉత్సవాల నిర్వహణ
- నేడు భృంగివాహనంపై భక్తులకు స్వామిఅమ్మవార్ల దర్శనం

బ్రహ్మోత్సవ శోభ


బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభంపై ఆవిష్కృతమైన ధ్వజపటం

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి సందర్భంగా శ్రీశైలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, అధికారులు, ఆలయ అర్చకులు, పండితులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం పండితులు చతుర్వేదపారాయణలతో వేదస్వస్తి నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. గణపతిపూజ, వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవచనం జరిపించారు. బ్రహ్మోత్సవ నిర్వహణకు ఆధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈఓ, అధికారులు, అర్చకస్వాములు, స్థానాచార్యులు కంకణాలు ధరించి రుత్విగ్వరణం, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్టానములు, పారాయణలు నిర్వహించారు.

అంకురార్పణ అంటే..

ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలో ఉన్న మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువచ్చి, ఆ మట్టిని 9 పాలికల్లో (మూకుళ్లలో) నింపుతారు. దాంట్లో నవధాన్యాలు పోసి మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు. అందులో భాగంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ చేశారు.

ధ్వజారోహణ

ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతాకావిష్కరణ చేయడమే ధ్వజారోహణ. కొత్త వస్త్రంపై పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్ట మంగళ చిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే నందీశ్వజపటం అంటారు. ఈ నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి చండీశ్వరస్వామి సమక్షంలో పూజలు నిర్వహించారు. అలాగే భేరిపూజలో డోలు వాద్యానికి పూజలు చేశారు. అనంతరం నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ముక్కోటి దేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు గానూ ఈ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

నేడు భృంగివాహనసేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహిస్తారు.

విద్యుత్ దీప కాంతులు

సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల ఆలయాన్ని దేవస్థానం అధికారులు సుందరంగా అలంకరించారు. ధ్వజస్తంభం, స్వామి అమ్మవార్ల ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ గోపురాలకు, గంగాధర మండపం వద్ద ప్రధాన ఆలయానికి ఎదురుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటాలతో విద్యుద్దీకరణ చేశారు. దీంతో శ్రీశైల ఆలయ పరిసరాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి.


ధ్వజారోహణ చేస్తున్న ఈఓ లవన్న, అర్చకులు

‘వివేక’ దీప్తి


కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో పూలమాలలతో వివేకానందుడి విగ్రహం

స్వామి వివేకానంద జయంతి వేడుకలను గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో నరేంద్రుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడి జీవితంలో ప్రధాన ఘట్టాలను స్మరించుకున్నారు. ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసిన మహనీయుని బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు.

యువతకు వివేకానందుడి జీవితం ఆదర్శం

యువతీ, యువకులకు వివేకానందుడి జీవితం ఆదర్శమని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. వివేకానందుడి చిత్ర పటానికి కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ పీవీ రమణ, సీపీఓ అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

-కర్నూలు(సెంట్రల్)

టీడీపీ నేతల మాయ మాటలు నమ్మొద్దు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం


లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: టీడీపీ నేతల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. దేవనకొండ మండలం ఐరన్‌బండ, గుమ్మరాళ్ల గ్రామాల్లో గురువారం 18 మందికి ఇంటి నివాస స్థలాలను(ఇంటి పట్టాలను) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడి హయాంలో గ్రామంలో ఒకరు, ఇద్దరు చేతుల్లోనే పెత్తనం ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితులు లేవన్నారు. దత్తపుత్రుడు పవన్‌తో పాటు ఎంతమంది మంది కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలకు చెందిన సీఎంలు, ఐఏఎస్ అధికారులు వచ్చి అధ్యయనం చేసి వెళ్తున్నారన్నారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేసిందన్నారు. సర్పంచ్ భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, తెర్నేకల్ సర్పంచ్ అరుణకుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంభీమ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనాలకు 17లోగా దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): పెట్రోల్ సబ్సిడీ కింద మూడు చక్రాల వాహనాల కోసం 2022-23 సంవత్సరానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్హులైన శారీరక విభిన్న ప్రతిభావంతులు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. గురువారం ఈ మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.విజయ ఒక ప్రకటన విడుదల చేశారు. స్వయం ఉపాధి, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న శారీరక విభిన్న ప్రతిభావంతులు సదరం, ఆదాయ సర్టిఫికెట్లతోపాటు రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. అలాగే ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ నెల వరకు పెట్రోల్ బిల్లులు అభ్యర్థి, పంపిణీదారుని సంతకాలతో జతచేయాలని తెలిపారు. ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్నవారు సంబంధిత కంపెనీ నుంచి లేఖను కూడా జతచేయాలని సూచించారు. అన్ని జిరాక్స్ కాపీలతో 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో 08518-277864 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ

క్వింటా ధర రూ.8,730

- మద్దతు ధరకు మించి లాభం
- ఏడాదికేడాది పెరుగుతున్న సాగు
- ఖరీఫ్‌లో 1,08,792 ఎకరాల్లో పంట
- ఇప్పటికే 4.5లక్షల క్వింటాళ్ల విక్రయం


రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ దిగుబడులు

వేరుశనగ సాధారణ సాగు: **1,46,872** / మూడేళ్ల క్రితం సాగు: **88,736** / ఈ ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం: **1,08,792**

ఈ ధర ఎప్పుడూ సూడల్యా



ఈ ఏడాది మూడెకరాల్లో వేరుశనగ సాగు చేసిన. 16.5 క్వింటాళ్ల(55 సంచులు) దిగుబడి వచ్చింది. ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో క్వింటా వేరుశనగ రూ.8,730లకు అమ్ముడు పోయింది. గతంలో ఎప్పుడూ ఈ ధర సూడల్యా. నా కష్టమంతా మర్చిపోయిన.

– నరసింహులు, గోనెగండ్ల

ప్రకృతి కరుణించడం.. ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుండటంతో వేరుశనగ సాగు రోజురోజుకూ విస్తరిస్తోంది. గతంలో వర్షం కురుస్తుందో లేదోననే బెంగ.. పంట పండుతుందో లేదోనని ఆందోళన.. అరకొర దిగుబడి వచ్చినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక దిగాలు. ఇలాంటి పరిస్థితి నుంచి వేరుశనగ రైతు ముఖంలో ఆనందం తాండవిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను మించి గతంలో ఎప్పుడూ చూడని ధర లభిస్తుండటంతో అన్నదాత ఆనందానికి అవధుల్లేవు.

ఎమ్మిగనూరు: జిల్లాలో వేరుశనగ సాగు క్రమంగా పెరుగుతోంది. సాంప్రదాయ వ్యాపార పంటగా గుర్తింపు పొందడంతో పాటు పశుగ్రాసంగానూ పరోక్షంగా తోడ్పడుతున్న వేరుశనగ సాగు రైతులకు ఎంతో మక్కువ. గతంలో వర్షాభావ పరిస్థితులు, వేగంగా విస్తరిస్తున్న వాణిజ్య పంటలతో వేరుశనగ సాగు గణనీయంగా తగ్గింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రకృతి కలిసి రావడం, గత మూడేళ్ల నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పాటు ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదోని, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు డివిజన్‌లలో వేరుశనగ ఏడాదికేడాది అధికమవుతోంది.

‘మద్దతు’కు మించిన ధరలు

విత్తు మొదలు పంట ఉత్పత్తుల విక్రయాల వరకు అడుగడుగునా ప్రభుత్వ పర్యవేక్షణ, చేయూతతో రైతుల్లో వ్యవసాయం పట్ల మళ్లీ ఆశలు చిగురించాయి. రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సేవలను ప్రతి పల్లెకు మరింత చేరువయ్యాయి. మార్కెట్‌యార్డుకు విక్రయానికి తెచ్చే పంట ఉత్పత్తుల నాణ్యతను బట్టి మెరుగైన రేట్లను వ్యాపారుల నుంచి రైతులకు అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయటం మరో మైలురాయి. అందులో భాగంగా మార్కెట్‌యార్డుల్లో నాణ్యత టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం తీసుకుటున్న చర్యలతో రైతులు, వ్యాపారుల మధ్య వేళ్లూనుకుపోయిన దళారీ వ్యవస్థ క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తోంది.

వేరుశనగ మద్దతు ధర రూ.5550

మూడేళ్లనుంచి వేరుశనగ నాణ్యతను బట్టి రైతులకు మద్దతుకు మించి ధర లభిస్తోంది. ఈ యేడాది వేరుశనగ పంట దిగుబడులు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో క్వింటా రూ.8730 కాగా.. ఆదోని మార్కెట్‌యార్డులో రూ.8,660 పలికింది. బుధవారం ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో క్వింటా వేరుశనగ గరిష్ట ధర రూ.8091లకు చేరుకోవడం విశేషం. మద్దతు ధర రూ.5,550 కంటే తక్కువ రేటు ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఆ అవసరం లేకుండా వేరుశనగ రైతులకు మద్దతు ధర కంటే క్వింటాపై అదనంగా రూ.3వేలకు పైగా లభిస్తోంది. 2018-2019లో జిల్లా మొత్తం మీద 4.58 లక్షల క్వింటాళ్ల వేరుశనగ పంట పండితే 2020-21లో 8.75 లక్షల క్వింటాళ్లకు పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 12 మార్కెట్ యార్డులు ఉండగా.. అందులో ఆదోని, డోన్ డివిజన్‌లలోనే రైతులు అధికంగా వేరుశనగ సాగుచేస్తారు. ఈ యేడాది ఇప్పటికే 4.53లక్షల క్వింటాళ్ల వేరుశనగ దిగుడులను రైతులు మార్కెట్లకు తరలించి విక్రయించారు.

ప్రభుత్వ తోడ్పాటు

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పెట్టుబడి సాయంతో మొదలై సబ్సిడీ విత్తనాలు, ఎరువులను అందజేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో గ్రామస్థాయిలోనే ప్రభుత్వ రాయితీలను పొందుతూ రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారానే అమ్ముకొనే అవకాశం కల్పించింది. మండల, సబ్‌డివిజన్ స్థాయి వ్యవసాయాధికాలకు తోడుగా ప్రతి సచివాలయంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి రైతులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సస్యరక్షణ చర్యలపై అవగాహనలు కల్పిస్తున్నారు. కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువులపై నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

క్వింటా రూ.8,091లకు అమ్ముడుపోయింది



వేరుశనగ దిగుబడలను ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన. క్వింటా ధర రూ.8,091చొప్పున మొత్తం 4.5క్వింటాళ్ల అమ్మిన. దిగుబడి కొంచెం తగ్గినా వేరుశనగకు మంచిరేటు రావటం ఆనందంగా ఉంది.

– బి.నరేష్, వేరుశనగ రైతు

రైతులకు మెరుగైన సౌకర్యాలు



మార్కెట్‌యార్డుకు వచ్చే రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా వేరుశనగ నాణ్యతను పరీక్షించి రైతు దిగుబడులకు గుర్తింపు ఇస్తాం. దళారి వ్యవస్థ లేకుండా రైతులు తమ సరుకును నేరుగా ఈ-నామ్‌తో విక్రయాలు సాగిస్తున్నారు.

– ఉమాపతిరెడ్డి, స్పెషల్‌గ్రేడ్ కార్యదర్శి

క్లుప్తంగా

13 మంది స్టాంప్ వెండర్లపై వేటు


నంద్యాలలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్న 13 మంది వెండర్లపై వేటు వేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపులను మూడు రెట్లు అధికంగా ధర నిర్ణయించి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఈనెల 5న కర్నూలులో, 12న నంద్యాలలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్నూలులో 9 మంది, నంద్యాలలో నలుగురు అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో వారి వద్ద ఉన్న స్టాంపులన్నింటినీ స్వాధీనం చేసుకుని నంద్యాల, కర్నూలు జిల్లాల రిజిస్ట్రార్లకు అప్పగించి సస్పెండ్ చేయించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్వర రెడ్డి మాట్లాడుతూ అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనల ప్రకారం స్టాంపులను అమ్ముకోవాలని, కాలం చెల్లిన వాటిని వెంటనే రిజిస్టర్ కార్యాలయాల్లో అప్పగించాలని సూచించారు.

ఎస్టీ అంధ విద్యార్థులకు రీడర్ అలవెన్స్ స్క్రైబ్

కర్నూలు(అర్బన్): అంధులైన ఎస్టీ విద్యార్థినీ, విద్యార్థులు 2022–23 సంవత్సరానికి రీడర్ అలవెన్స్ స్క్రైబ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.విజయ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విద్యార్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులను స్వయంగా అందించాలన్నారు. రీడర్ అలవెన్స్ స్క్రైబ్ కోసం సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను జతచేయాలన్నారు.


గోడ దిగురా చిన్నా.. అమ్మకు ఉద్యోగం వస్తోంది!


బంగారు భవిష్యత్ కోసం: నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన యువతీ, యువకులు


చిట్టి తల్లీ ఏడ్వద్దు.. జగన్ మామయ్య ఉద్యోగాలిస్తున్నారు


నీళ్లు తాగురా కన్నా..మన కష్టాలు తీరినట్లే


అరుదైన అవకాశం: దరఖాస్తును పరిశీలించుకుంటూ..

కొలువుల జాతర

వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీలన్నింటినీ రాష్ట్రప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తోంది. యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. కర్నూలు, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం కర్నూలు డీఎంహెచ్ఓ కార్యాలయంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు అభ్యర్థులను పిలిచారు. ఇందులో భాగంగా 7 స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ (పీడియాట్రిషన్), 14 మెడికల్ ఆఫీసర్, 2 ఫిజియోథెరపిస్ట్, 3 క్లినికల్ సైకాలజిస్ట్, 1 ఆప్టోమెట్రిస్ట్, 1 అర్లీ ఇంటర్వెన్షనిస్ట్ కమ్ స్పెషల్ ఎడ్యుకేటర్, 29 స్టాఫ్ నర్సులు, 4 ల్యాబ్ టెక్నీషియన్, 1 డేటా ఎంట్రీ ఆపరేటర్, 1 కుక్ కమ్ కేర్ టేకర్ కలిపి మొత్తం 63 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సర్టిఫికెట్లు పరిశీలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

దేశ భక్తులను తయారు చేయాలి

● సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాల్లో ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్య కారిణి సదస్యులు వారణాసి రాం మాధవ్



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాంమాధవ్, తదితరులు, వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు, స్థానికులు

కర్నూలు కల్చరల్: సరస్వతి శిశు మందిరాలు దేశ భక్తులను తయారు చేయడంతో పాటు దేశ హితం కోసం ముందుకు సాగాలని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్యులు వారణాసి రాం మాధవ్ అన్నారు. సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవ వేడుకలు గురువారం కర్నూలు నగర శివారులోని కమ్మ యడ్లపల్లి పుల్లారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన రాంమాధవ్ మాట్లాడుతూ సరస్వతీ విద్యా పీఠం స్వచ్ఛంద సేవా సంస్థగా విద్యారంగంలో 1973లో ఏర్పాటైందన్నారు. జాతీయ విద్యను వికసింపజేసే లక్ష్యంతో శిశు మందిరాలు ప్రారంభించి 2023 మార్చి నాటికి 50 సంవత్సరాలు పూర్తవుతోందన్నారు. 1952లో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ప్రారంభించిన సరస్వతీ విద్యా పీఠం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 26వేల విద్యాసంస్థల్లో 36 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. దేశ శ్రేయస్సుకు చదువు ఒక్కటే కాదని సమైక్యతా భావం చాలా అవసరమన్నారు. సమ్మేళన ప్రముఖ్ విజయానంద్, విద్యాభారతి అఖిల భారత అధ్యక్షులు దూసి రామకృష్ణారావు, ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, రామకృష్ణారెడ్డి విద్యా సంస్థల అధినేత జి.రామకృష్ణారెడ్డి మాట్లాడారు. అంతకు ముందు వివేకానంద విగ్రహానికి, భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పరిపూర్ణతను వెలికి తీసేదే అసలైన విద్య

స్వర్ణోత్సవాల్లో సహస్ర అవధాని గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ మనిషిలోని పరిపూర్ణతను వెలికి తీసేదే అసలైన విద్య అన్నారు. విద్యా విధానంలో చాలా లోపాలు ఉండటంతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. గతంలో ఆరు నెలలకో, సంవత్సరానికో పరీక్షలు పెట్టేవారన్నారు. ప్రస్తుతం రోజుకో పరీక్ష పెడుతూ మార్కులను బేరీజు వేస్తూ విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. శరీరాన్ని మించిన క్షేత్రం, మనసును మించిన తీర్థం, జీవితాన్ని మించిన గ్రంథం, అంతఃకరణను మించిన గురువు లేదన్నారు.



క్షణికావేశానికి రెండు ప్రాణాలు బలి

ఇద్దరు కూతుర్లు సహా ఎల్ఎల్‌సీ కాలువలో దూకిన తల్లి

- గల్లంతైన మహిళ, ప్రాణాలొదిలిన ఏడాది పాప
- మరో పాపను కాపాడిన వ్యవసాయ కూలీలు



గల్లంతైన లక్ష్మి(ఫైల్), మృతిచెందిన బాలిక శాంతి


ప్రాణాలతో బయటపడ్డ బాలిక వెన్నెల

ఆలూరు రూరల్: క్షణికావేశం రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఇద్దరు ఆడపిల్లలతో సహా ఎల్ఎల్‌సీ కాలువలో దూకింది. లక్ష్మి(30) గల్లంతు కాగా.. శాంతి(1) మరణించింది. మరోపాప వెన్నెలను అక్కడి వ్యవసాయ కూలీలు ప్రాణాలతో కాపాడారు. వివరాలివీ.. ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన వీరభద్రికి హొళగుంద మండలం బొమ్మగుండన హళ్లి గ్రామానికి చెందిన లక్ష్మి(30)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇతను గొర్రెల కాపరి. వీరికి నలుగురు ఆడపిల్లలు సంతానం. గత కొన్నేళ్లుగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం లక్ష్మి తన ఇద్దరు చిన్న పిల్లలైన వెన్నెల, శాంతిని తీసుకుని ప్రస్తుతం బళ్లారిలో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. గురువారం హత్తిబెళగల్ గ్రామానికి బయలు దేరింది. కర్ణాటక రాష్ట్రంలోని ఎర్రగుడి గ్రామం వద్ద దిగి.. ఇద్దరు పిల్లలతో సహా సమీపంలోని ఎల్ఎల్‌సీ కాలువలో దూకింది. పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు కేకలు వినిపించడంతో ఇద్దరు పిల్లలను ఒడ్డుకు చేర్చారు. ఇందులో శాంతి(1) చనిపోయింది. వెన్నెల ప్రాణాలతో బయటపడింది. గల్లంతైన లక్ష్మి కోసం గాలిస్తున్నారు.

పక్కా పథకం ప్రకారమే హత్య

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వినోద్‌కుమార్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఆదోని అర్బన్: పక్కా పథకం ప్రకారమే కౌతాళం మండలం పాతకుంబళనూరు గ్రామంలో ఈనెల 7వ తేదీన ఈడిగ శివకుమార్‌ను హత్య చేసినట్లు డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. హత్యకు ఉపయోగించిన రెండు బైకులు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కౌతాళం మండలం నదిచాగి గ్రామానికి చెందిన రామన్నగౌడ్, శివకుమార్ గౌడ్ ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. అదే గ్రామానికి చెందిన డీలర్ ఈరన్న 2015లో హత్యకు గురి కాగా, ఈ కేసులో వీరిద్దరితో పాటు మరికొంత మంది నిందితులుగా ఉన్నారు. డబ్బు ముట్టజెప్పి ఈ కేసు నుంచి బయటపడేలా పంచాయితీ చేసుకున్నారు. అయితే రామన్నగౌడ్ సగం డబ్బు ఇవ్వడం, మిగతా సగం మిగిలిన నిందితులు భరించేలా పంచాయితీ చేయడంతో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని 2020లో రామన్నగౌడ్ అనుచరుడు అయిన దేవన్నపై శివకుమార్‌గౌడ్ కత్తితో దాడి చేసినట్లు కౌతాళం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2021 జూన్‌లో రామన్నగౌడ్‌ను హత్య చేయాలని శివకుమార్‌గౌడ్ కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వం టౌన్‌కు చెందిన సుపారీ గ్యాంగ్‌తో మాట్లాడుకుని కుట్ర పన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కౌతాళం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆ గ్యాంగ్ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. 2021 నవంబర్‌లో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకాలోని హొచ్చళ్లి గ్రామంలో రామన్నగౌడ్ వాహనంపై దాడి జరిగింది. అయితే వాహనంలో తమ్ముడు బసన్నగౌడ్ ఉండడంతో రామన్నగౌడ్ తప్పించుకున్నాడు. ఎప్పటికైనా తనకు ప్రాణహాని ఉందని తెలుసుకున్న రామన్నగౌడ్ ఈనెల 3వ తేదీన అతని తమ్ముడు బసన్నగౌడ్, అతని అనుచరుడు దేవన్న, దేవన్న కుమారులు రాముడు, ముదియప్పతో శివకుమార్ హత్యకు పక్కా పథకం రూపొందించాడు. గ్రామంలో పోలీసు పికెట్ ఉన్నందున పక్క గ్రామమైన పాతకుంబళనూరులో హత్యకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈనెల 7వ తేదీన సాయంత్రం పాతకుంబళనూరులో కల్లుపెంట వద్ద శివకుమార్‌పై మూకుమ్మడిగా ఐదుగురు దాడి చేసి, కళ్లల్లో కారం కొట్టి, వేటకొడవళ్లతో అతి కిరాతకంగా నరికి చంపి, అనంతరం కర్ణాటక రాష్ట్రం మాన్వం వైపు పారిపోయారని డీఎస్పీ తెలిపారు. బెయిల్ కోసం ఆదోనిలో లాయర్‌ను కలవడానికి వచ్చిన ఐదుగురు నిందితులను బుధవారం హాల్వి గ్రామం ఆర్చ్ వద్ద కోసిగి సీఐ ఎరిషావలి, ఎస్ఐ రాజారెడ్డి, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పెద్దకడబూరు పోలీసు సిబ్బంది అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన రెండు బైకులు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. త్వరితగతిన కేసును ఛేదించిన కోసిగి సీఐ, ఎస్ఐ, కౌతాళం ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. నదిచాగి గ్రామంలో ఇప్పటివరకు పోలీసు పికెటింగ్ ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరింత భద్రత పెంచామన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరం

● రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్


మాట్లాడుతున్న విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): రాయలసీమలోని రైతులు పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులో జరుగుతున్న రెండు రోజుల రైట్‌షాపు ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయంలో సన్న, చిన్నకారు రైతులు సత్ఫలితాలు సాధిస్తున్నారని, వీరిని చూసి పెద్ద రైతులు కూడా స్ఫూర్తి పొందుతున్నారన్నారు. మహిళా సంఘాలు మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల్లో అన్ని రకాల పంటలు ప్రకృతి వ్యవసాయంలోనే చేపడితే పెట్టుబడి వ్యయం తక్కువగా ఉంటుందని, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో కిచెన్ గార్డులు అభివృద్ధి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఏడాదికి సరిపడా విత్తనాలను సమకూర్చుకోవడంపై ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. రెండో రోజు రైట్‌షాప్‌లో రాయలసీమ జిల్లాలకు చెందిన ప్రాజెక్టు మేనేజర్లు ఆయా జిల్లాల ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్లు రాయుడు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సలహాలపై 19 నుంచి ఈఆర్‌సీ విచారణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారిఫ్, క్రాస్ సబ్సిడీ, సర్ చార్జీల ప్రతిపాదనలపై, సవరణలపై ఈనెల 19వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) విచారణ జరపనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 వార్షిక సంవత్సరానికి గాను విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన ప్రతిపాదనలపై ఈఆర్‌సీ బృందం 19, 20, 21వ తేదీల్లో ఆన్‌లైన్ (వీడియోకాన్ఫరెన్స్) ద్వారా విచారణ చేపడుతుందని వెల్లడించారు. వీటిపై సూచనలు, అభ్యంతరాలు, సలహాలు వ్యక్తం చేయాలనుకున్న వినియోగదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు ముందుగా ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఆ తేదీల్లో కర్నూలు సర్కిల్ కార్యాలయంలో పాటు నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీసీ ద్వారా పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

17 వరకు 'కుడా' అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు (టౌన్): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాస్టర్ ప్లాన్‌పై ఈనెల 17వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు కుడా వైస్ చైర్మన్ భార్గవ్‌తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,599.50 చదరపు కిలోమీటర్ల ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ప్రజలు తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని గతంలోనే నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. గతేడాది డిసెంబర్3వ తేదీ జారీ చేసిన నోటిఫికేషన్ ఈ ఏడాది జనవరి 3వ తేదీ నాటికి ముగిసిందని తెలిపారు. అయితే ప్రజలు, ప్రజాప్రతినిధులు, గుర్తింపు పొందిన సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈనెల 17వ తేదీ వరకు కుడా కార్యాలయంలో అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులు ఈ–శ్రామ్‌ను పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ–శ్రామ్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.

ఆన్‌లైన్‌లో చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం ఎంతో సులువు అని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ విద్యుత్ బిల్లుల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ముగిసిందని, డిమాండ్ నోటీసులు అందరికీ జారీ చేశామని వెల్లడించారు. బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఎక్కడ ఉన్నా చెల్లించడం సులభమన్నారు.

తిరుమలలో గదుల అద్దెను పెంచడం తగదు

కర్నూలు(సెంట్రల్): తిరుమలలో గదుల అద్దెను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాలంకి రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అలాగే శ్రీశైలం దేవస్థాన ప్రసాదాల కోసం వాడే వస్తువుల సరఫరా కాంట్రాక్టుల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరపాలని బీజేపీ డిమాండ్ చేసింది.

'ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌పై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(సెంట్రల్): భారత రాజ్యాంగాన్నే సవాల్ చేస్తూ మాట్లాడిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై చర్యలు తీసుకోవాలని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ సుభాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన అవాజ్ కార్యాలయంలో మాట్లాడుతూ.. మోహన్ భగవత్ తమ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత రాజ్యాంగాన్ని, పౌరుల సమాన హక్కులు, చట్టబద్ధ పాలన, లౌకిక ప్రజాస్వామ్యాన్ని అవమానించే రీతిలో మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సురక్షితంగా ఉండాలంటే ముస్లింలు ఆధిపత్యపు ఆలోచనలను విడనాడాలని, ముస్లింమైనార్టీలను హెచ్చరించడాన్ని ఆయన ఖండించారు. మతం ప్రతిపాదికన భారత పౌరుల్లో ఒక వర్గానికి వ్యతిరేకంగా హింసకు పాల్పడాలని పిలుపునివ్వడం దారుణమన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు.

జీఓ రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): రోడ్లపై సభలు, ర్యాలీల నిర్వహణను నిషేధిస్తూ చేసిన చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీఓ నంబర్ ఒకటి ద్వారా సభలు, సమావేశాలు నిర్వహించుకునే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. వెంటనే జీఓను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.వెంకటేష్, బి.రమేష్, జె.లలితమ్మ, మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

14న రంగనాథుడి కల్యాణం

కర్నూలు కల్చరల్: ధనుర్మాస పూజల్లో భాగంగా నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత దేవాలయంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ గోదాదేవి రంగనాథస్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీచిన్నజీయర్ స్వామి శిష్యుడు శ్రీశ్రవణాచార్యులు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య , తెగింపు
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ధమాకా, వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, తెగింపు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, కుట్టీ, ఎమ్‌త్రీగన్
భరత్ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య
రాజ్. శ్రీరామ : వీర సింహారెడ్డి
విజయ : వాల్తేర్ వీరయ్య

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి

- దగా చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలి
- పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మార్కెట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ప్రతి ఒక్కరూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పని చేయాలని పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. మార్కెట్ కమిటీ అధికారులు, పాలక వర్గం సభ్యులు ప్రత్యేక గ్రూపులుగా ఏర్పడి మార్కెట్‌లో తిరుగుతూ.. తూకాలు, రైతులకు తక్‌పట్టీలు ఇచ్చారా, హమాలీల చార్జీల కింద ఎంత కట్ చేశారు తదితర విషయాలను పరిశీలించాలన్నారు. బుధవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీకి 2022 సెప్టెంబర్ నుంచి డిసెంబరు వరకు వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలను మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు పాలకవర్గానికి వివరించారు. ఇప్పటి వరకు వివిధ కారణాల వల్ల కమీషన్ ఏజెంట్లపై తీసుకున్న చర్యలను పాలక వర్గం దృష్టికి తెచ్చారు. సెప్టెంబరులో రూ.61.47 లక్షలు ఆదాయం రాగా రూ.2.10 కోట్లు ఖర్చు, అక్టోబరులో రూ.53.44 లక్షలు ఆదాయం రాగా రూ.34.82 లక్షలు, నవంబర్‌లో రూ.55.39 లక్షలు ఆదాయం రాగా.. రూ.79.01 లక్షలు, డిసెంబరులో రూ.63.62 లక్షలు ఆదాయం రాగా…రూ.42.58 లక్షల ప్రకారం ఖర్చు చేశారు. ఆదాయం, వ్యయాలకు, వివిధ చెల్లింపులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ…మార్కెట్ యార్డులో రైతులను దగా చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని, మరోసారి దగా చేసే అవకాశం ఇవ్వరాదని పేర్కొన్నారు. చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ… ప్రతి ఒక్కరూ జవాబుదారితనంతో పనిచేస్తే మార్కెట్‌లో రైతులకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉందని వివరించారు. తాము మార్కెట్ కమిటీ పాలక వర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతుల సంక్షేమానికి, మార్కెట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు.

మార్కెట్ యార్డులో పర్యటన

మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే కాటసాని, చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాలక వర్గం సభ్యులు కలియతిరిగారు. మార్కెట్ నిర్మిస్తున్న జంబోషెడ్ పనులను, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. వివిధ పంటలను తెచ్చిన రైతుల చెంతకు వెళ్లి మాట్లాడారు. మీకు మార్కెట్‌లో ఏవైన ఇబ్బందులు ఉన్నాయా... తూకాలు సక్రమంగా ఉంటున్నాయా తదితర విషయాలను ఆరా తీశారు. ఎవరైన దగా చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీమేశ్వరరెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి, అసిస్టెంటు సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఒలంపిక్ సంఘం సభ్యులు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): ఈ నెల 14న కృష్ణ జిల్లా గన్నవరం పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని రాష్ట్ర ఒలంపిక్ సంఘం సభ్యులు బి.రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ చూపే క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు బాష, మధు పాల్గొన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం


వడ్డెగేరిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బి.వై.రామయ్య

- నగర మేయర్, కర్నూలు ఎమ్మెల్యే
- రూ.1.22 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని అన్ని వార్డుల్లో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తు సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నగర మేయర్ బివై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని 45వ వార్డులో రూ.76.30 లక్షలు, 12వ వార్డులో రూ.23.03 లక్షలు, 52వ వార్డులో రూ.23 లక్షలతో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో పాలక వర్గం ఏర్పడి ఏడాదిన్నరలో నగరంలోని అన్ని వార్డుల్లో సమాన ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే నగరంలో పెద్ద సంఖ్యలో మురుగు కాల్వలు, కల్వర్టులు, సీసీ రోడ్లు వంటి పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. రూ.8 కోట్లు వెచ్చించి నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మున్సిపల్ పార్కులను అందంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అలాగే పాతబస్టాండ్‌లో కర్నూలు నగరానికే తలమానికంగా ఉన్న కొండారెడ్డి బురుజు వద్ద పెద్ద ఎత్తున సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. గత టీడీపీ పాలనలో కర్నూలు నగరాన్ని పూర్తి స్థాయిలో విస్మరించినందుకే సమస్యలు తాండవిస్తున్నాయని ఆరోపించారు. నాడు అధికారంలో ఉన్న కర్నూలు నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించకుండా, అభివృద్ధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. అయితే తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సమస్యలతో పాటు, శివారు కాలనీలలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కర్నూలును మరింత క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో 45వ వార్డు కార్పొరేటర్ మాణిక్యమ్మ, కోఆప్షన్ మెంబర్లు నయీం పాషా, మేరీ, మున్సిపల్ ఎస్‌ఈ శేషసాయి, మున్సిపల్ ఇంజినీర్ షాకీర్, డీఈఈలు గోపాల్‌కృష్ణ, నరేష్, రాజశేఖర్, ఏఈలు దినేష్ రాచయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యానికి జగనన్న ఆసరా

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో వృద్ధురాలు వెంకటమ్మ
- గని గల్లీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): 'మా అమ్మాయికి పెద్ద జ్వరమొస్తే ప్రవేట్ ఆస్పత్రికి తీసుకుపోయినాం. రక్త పరీక్షలు చేసి కణాలు తగ్గినాయ్. వారం రోజులుండాలి. కణాలు ఎక్కించాలి. ఏసీలో పెట్టాలి. రూ.70వేలు ఖర్చవుతాయి అని సెప్పినారు. ఎలాగ దేవుడా అని కాళ్లు సేతులు ఆడలేదు. అప్పుడు మా వలంటీర్‌ను అడిగితే ఆరోగ్యసిరి కార్డు ఉంటే ఫ్రీగా అన్ని సేస్తరు అని సెప్పింది. ఆస్పత్రిలో కార్డు సూపిస్తే నిజంగా అన్ని పరీక్షలు సేసి, మందులు, సూదులు, గ్లుకోస్ బాటిళ్లు పెట్టిరి. దినాం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రేత్రి అన్నం తెచ్చిరి. ఇంటికి పోయేటప్పుడు చార్జీకి ఇచ్చి పంపిరి. మా జగనన్న వచ్చినాక ఆరోగ్యానికి ఆయనదే ఆసరా' అంటూ ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్‌తో తనకు జరిగిన మేలును చెప్పుకుంది గని గల్లీకి చెందిన వెంకటమ్మ. గురువారం రాత్రి ఎమ్మెల్యే 4వ వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గని గల్లీ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ల బ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఆసుపత్రుల్లో వసతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న డాక్టర్, పారా మెడికల్ సిబ్బంది పోస్టులు భర్తీ చేశారని, నాడు- నేడు పథకం కింద ఆసుపత్రుల రూపురేఖలు మార్చేశారన్నారు. ఆరోగ్య శ్రీలో మరిన్ని వ్యాధులను చేర్చి పటిష్ట పరిచారని, ఇది వర్తించని వ్యాధులకు వైద్యం చేయించుకుంటే ఆ డబ్బును సీఎం రిలీఫ్ ఫండ్ కింద అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అర్షియా ఫర్హీన్, రియాజ్ బాబా, కార్పొరేటర్ జుబేర్, నాయకులు ఖాదర్, మాబుసా, చున్ను, ఫాజిల్, హకీమ్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందజేస్తున్న మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్‌లు

కార్మికుల ఆరోగ్య భద్రతే లక్ష్యం

కర్నూలు (టౌన్): కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ కార్డులను అందజేశారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, డిప్యూటీ కమిషనర్ ఎ.వెంకట రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సాధారణ ఉద్యోగుల తరహాలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్టు కార్మికుల శ్రేయస్సు కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. తద్వారా ఈఎస్ఐ సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ రామ సుందర్‌రెడ్డి స్థానిక చాణిక్యపురి కాలనీలోని 42వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. అయితే సచివాలయంలోని వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంటు కార్యదర్శి ఏ.అరుణ, వార్డు హెల్త్ కార్యదర్శి ఆర్.ఉమామహేశ్వరమ్మ, వార్డు ఎనర్జీ కార్యదర్శి కె.శేషాద్రిలు అందుబాటులో లేరు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వీరికి నగరపాలక కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల వ్యవధిలో లిఖితపూర్వకంగా సమాధానం తెలియజేయాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని నోటీసుల్లో పేర్కొన్నారు.

మోడల్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో పోలీస్ కానిస్టేబుల్ మోడల్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన రాష్ట్ర స్థాయిలో కానిస్టేబుల్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 97039 23473, 96767 69878 నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి హుసేన్‌బాషా, స్పోర్ట్స్ కన్వీనర్ శంకర్, నగర ఉపాధ్యక్షులు సూర్య, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అమర్, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత కర్నూలు


విజేతగా నిలిచిన కర్నూలు హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 11, 12 తేదీలలో బాపట్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–19 శాప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ పోరులో ఏలూరు జట్టుపై కర్నూలు జట్టు 13–22 పాయింట్లతో విజయం సాధించింది. దీంతో కప్, మెడల్స్ కైవాసం చేసుకున్న జట్టు సభ్యులను హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రుద్రా రెడ్డి అభినందించారు.

జిమ్నాస్టిక్స్‌లో విద్యార్థినికి కాంస్యం

కర్నూలు (టౌన్): ఈ నెల 8, 9 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి శాప్ జిమ్నాస్టిక్స్ క్రీడలో మాంటే ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థినీ సుప్రితశ్రీ కాంస్యం పతకం సాధించింది. రాష్ట్ర పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారిణీని గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సీఈఓ రమణ, చీఫ్‌కోచ్ నటరాజరావు అభినందించారు.

నేషనల్ యూత్ డే వేడుకలు :

స్థానిక ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో గురువారం నేషనల్ యూత్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు దేశభక్తి గీతాలు, డ్రాయింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానికంగా స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఈఓ రమణ, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

కర్నూలు కల్చరల్: రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి నగర కార్యవాహిక వసంతలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా బీజేవైఎమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సుశీల 94900 81103, పూర్ణోదయ 80741 32365 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమ్మ రుణం తీర్చుకోలేనిది!


తల్లి శాంతమ్మను స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్తున్న వృద్ధుడు

నందికొట్కూరు మండలం బ్రహ్మంగారిమఠంకు చెందిన అతనికి 60ఏళ్లు పైగానే ఉంటాయి. వృద్ధాప్య ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొక్కవోని ధైర్యంతో బతుకీడుస్తున్నాడు. అయినా 80 ఏళ్లకు పైగా వయస్సున్న తల్లిని అన్నీ తానై చూసుకుంటున్నాడు. తనను పెంచి పెద్ద చేసి ప్రయోజకున్ని చేసిన కన్నతల్లి రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో తల్లి శాంతమ్మ అనారోగ్యం పాలైతే దగ్గరుండీ సపర్యలు చేస్తున్నాడు. ఇటీవల ఆమె కాలికి పుండు కావడం, గాయం మానక దుర్వాసన వస్తుండటంతో ఆసుపత్రి చుట్టూ తిరగడం నిత్య కృత్యమైంది. గురువారం సైతం నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రి నుంచి అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కన్నతల్లిని తీసుకొచ్చాడు. క్యాజువాలిటిలోకి స్వయంగా స్ట్రెచ్చర్‌పై తల్లిని ఉంచి తోసుకుంటూ లోపలికి వెళ్లాడు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ తల్లిపై కుమారుడి ప్రేమకు మనసులోనే సెల్యూట్ చేశారు.
– కర్నూలు(హాస్పిటల్)

ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టండి


బస్సులను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థను లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రజారవాణా శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన నంద్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ సాయంత్రం కర్నూలు కొత్తబస్టాండ్‌ను పరిశీలించారు. కర్నూలు–1 డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. రద్దీ అధికంగా ఉండే రూట్‌లతో పాటు ఆదాయం ఎక్కువగా వచ్చే మార్గాల్లో బస్సులు తిప్పాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సేవలందించినప్పుడే వారి మన్ననలు పొందుతామన్నారు. నిర్వహణ ఖర్చులు తగ్గించి ఇంధన పొదుపు మార్గాలను అనుసరించాలని సూచించారు. ఆయన వెంట కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుసేన్ ఉన్నారు.


వివేకానంద జయంతి వేడుకల్లో వీహెచ్‌పీ నాయకులు


నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ యూత్ నాయకులు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న చైర్మన్ సుభాష్‌చంద్రబోస్

స్ఫూర్తి ప్రదాత.. వివేకానంద

కర్నూలు కల్చరల్: స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. రాజ్‌విహార్ సర్కిల్‌లోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాత అయిన వివేకానంద ఆశయాలను యువత కొనసాగించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వివేకానంద బోధనల ద్వారా వ్యక్తి తన వ్యక్తిత్వంలో మార్పు తెచ్చుకోవచ్చన్నారు. వివేకానంద కేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర అధ్యక్షులు జి.పుల్లయ్య, కార్యదర్శి శివప్రసాద్, సభ్యులు వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయి రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కార్యదర్శి భానుప్రకాష్, భజరంగ్ దళ్ నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో వేడుకలు జరిగాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేవైఎమ్ రన్ ఫర్ యువ :

బీజేవైఎమ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యువ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వివేకానంద సర్కిల్ వరకు 2కే రన్ నిర్వహించారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేవైఎమ్ జిల్లా అధ్యక్షులు తలారి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు రఘునాథ్, రాజు, జిల్లా కార్యదర్శి సునీత, నాయకులు శరత్, కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

కర్నూలు సిటీ: నగరంలోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వివేకానంద తన ఉపన్యాల ద్వారా యువతలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ అడ్వైజర్ డా.స్టెల్లా సతీష్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బిక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ కాలేజీ అధ్యాపకులు విజయశేఖర్, వై.వి రామకృష్ణ, యు.నాగరాజు, క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



బీజేవైఎమ్ ఆధ్వర్యంలో..


నివాళులర్పిస్తున్న మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్

కచ్చితమైన ధరలకే వ్యవసాయ పనిముట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ పనిముట్లను కచ్చితమైన ధరలకే సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి కంపెనీలకు సూచించారు. గురువారం జేసీ తన చాంబరులో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఏఏ కంపెనీ ఎంత ధరలకు పనిముట్లను సరఫరా చేస్తాయనే దానిని ఆరా తీశారు. మొత్తంగా 29 కంపెనీల ధరలను జిల్లా స్థాయిలో ఖరారు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ధరలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఒకే కంపెనీకి చెందిన పనిముట్ల ధరలు వేర్వేరు జిల్లాల్లో ఒక్కో రకంగా ఉంటే తక్కువ ఉన్న ధరనే ప్రామాణికంగా తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్‌ల పంపిణీకి 313 కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. నిర్ణయించిన ధరలకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, శ్రీనివాస సురేష్, అగ్రానమీ ఏడీ బాలవర్ధిరాజు, టెక్నికల్ ఏవో రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువర్స్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి




త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లికింగ్



పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంత వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో

స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా

స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబీ 4జీబీ ర్యామ్ 128జీబీ 6జీబీ ర్యామ్ 256జీబీ 8జీబీ ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్



● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు



● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంటతడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.



● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.



● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్



● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...



● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.